# ఖండగతి

"ఈ పాపిష్టి తనువులు శాశ్వతంకావు. యే క్షణానికి ఎవరం యేమై పోతామో ఎరగం. కాస్త యీ చేయి కాలు కలిసుండగానే ఆ కుఱ్ఱాణ్ణి తెచ్చి దగ్గర పెట్టుకుందాం. కనీసం మన ముచ్చటైనా తీరుతుంది!" అన్నది సీతరామమ్మ గారు. ఆవిడ అట్లా అనేందుకు బోలెడు కారణం వుంది. పాతికేళ్ళాయే కాపురం చేస్తున్నదా, తన కడుపున పిల్లా పీచు కలిగే భాగ్యం కలగలేదు: పోనీ యికముందయినా ఆ అదృష్టం కలక్కపోతుందా అంటే ఆ కాస్త ఆశయినా ఆధారం లేకుండా పోతోంది. ఇకపోతే----చచ్చిపోయాక తలకింద కొరివి పెట్టేందుకూ ఆస్తి పాస్తుల్ని అనుభవించేదు కయినా ఎవరో ఒకరంటూవుండాలా? చూస్తూచూస్తూ పరలోక వాంఛల్ని చంపుకోలేరు, కష్టార్జితాలు గవర్నమెంటు పాలూ చెయ్యలేరు.

సీతారామమ్మగారు భర్తతో యిట్లా అనటం యీ సారే కొత్తకాదు. కాపురానికొచ్చిన అయిదోయేటినుంచి ఆవిడ యీ పాటే పాడుతున్నది. తను యీ మాట అన్నప్పుడు భర్త అదోరకంగా ముఖంపెట్టి "నువ్వు గొడ్రాలివని పూర్తిగా రుజూకాని" అంటే----ఎంతో ఆనందంగా వుండేది. తనకింకా పిల్లలు పుట్టే అవకాశం వున్నదేమోనని ఆలోచించేది. కాపురానికొచ్చిన ఎనిమిదేళ్ళకీ, పన్నెండేళ్ళకి పిల్లల్ని కన్నవాళ్ళ చరిత్రలు యే పుస్తకంలోనన్నా చదివినా, యెవరి నోటంటేనా విన్నా ఆవిడ హృదయం ఉప్పొంగేది. అదృష్టం అంటూ కలిసిరావాలే గాని దానికి వయసుతో సంబంధమేమిటి?---- కాని ఆ ఆశలూ దాదాపు అడియాసలయినాయి. కనకనే సీతారామమ్మగారికి యింకా నింపాదిగా కూర్చుసుండటంలో ఓపిక తగ్గిపోయింది. మనశ్శాంతి కోసం ఆవిడకో కుఱ్ఱాడు అవసరమయ్యాడు. ఒక విషయంలో నమ్మకం సడలిన తర్వాత కూడా పూర్వపు అభిప్రాయాలను మార్చుకోకుండా వుండేందు కావిడేమీ మొండితనం కలది కాదు.

కుఱ్ఱాడిని దత్తత చేసుకునే విషయమే వస్తే అదేమంత గొప్ప విషయం కాదు. సీతారామమ్మగారి మరిది యింటినిండా పిల్లలే. ఇరవై యేళ్ళనుంచి అయిదేళ్ళ వరకూ

అంతా సైజు వారీగా వున్నారు. వాళ్ళలో యే వొకడినితెచ్చి దగ్గరుంచుకున్నా ఆ తల్లిదండ్రులకేమీ అభ్యంతరం వుండదు. సీతారామమ్మగారి భర్త----క్షమించాలి, ఆయనకూడా పేరుంది, సీతాపతి గారి జాప్యమే ఇందుకు కారణం. ఈ పని యేక్షణంలో తల్చుకుంటే ఆ క్షణంలో చెయ్యగలదే గనక - యిందు విషయమై యేమీ ఆలోచించాల్సింది లేదని ఆయన మూకీ భావం వహించి వూరుకున్నారు. పోతే తన స్వంత కొడుక్కూ ఎవరో కనగా యిక్కడ పెరిగిన వాడికీనీ యేదో తేడా అనేది వుండే తీరుతుందనీ ఆయనకేమూలో అనుమానం కూడా లేకపోలేదు. అయినప్పటికీ చెయ్యగలిగిందేమీ లేదు!

ఆ రోజు సీతాపతిగారు యింటికి రావటం చాలా ఆలస్యమే అయింది. ఆవిడగారు పొద్దుట్నించి అదో రకంగా వుండి నిద్రపోదామన్న ఆలోచనే లేకుండా కూర్చున్నది.

"అట్లా వున్నావేం?" అన్నారాయన.

"మనస్సు బావులేదు"

"ఎంచేతో?"

వెంటనే జవాబు రాలేదు. సీతాపతిగారు యింక జవాబు రాదని రూఢయ్యాక ప్రశ్నార్థకంగా ఆమె వేపు చూచారు. "మీరు రేపే వెళ్ళి కిష్టిగాడిని తీసుకురండి."

సీతాపతిగారు కాస్త మనశ్శాంతిగా నవ్వుకున్నాడు. ఆయనకు పొద్దుట్నించి ఆవిడ పడుతూన్న వేదన యావత్తూ అర్థం అయిపోయింది. కొన్ని కొన్ని విషయాలు కొందరి మనసుల్ని అదేపనిగా కలిచివేస్తయి కావును---- అనుకున్నారాయన. సీతాపతిగారేమీ మాటాళ్ళేదు. మౌనం అర్ధాంగీకారంగానైనా తీసుకునే తాలిమి లేక ఆమె "మాట్లాడరేం?" అన్నది.

"నువు ఘట్టిగా వెళ్ళమంటే రేపే వెడతాను. కాని అంతకుముందు ఆలోచించాల్సిన విషయాలుకొన్నున్నాయి."

"ఏమిటవి" గాద్గదికంగా సీతారామమమ్మ గారు ప్రశ్నించింది.

"ఒకటి---- కుర్రవాడు నీకు పూర్తిగా అవసరం అని రూఢిగా నమ్మకం వుండాలి: అదే రకంగా కుర్రవాడికి నువ్వూ అవసరమే కావాలి, రెండు---- నువ్వు వాడిని జాగ్రత్తగా పెంచగలగాలి; మూడు---- ఏడెనిమిదేళ్ళుగా కుర్రాళ్ళ మధ్య

మెలుగుతున్నవాడు అకస్మాత్తుగా యిక్కడ పెరగటం తటస్థిస్తే వాడి మనస్థితి తారుమారు కాకుండా వుండాలి...'' సీతాపతిగారు చెప్పడం పూర్తయిందోలేదో గాని సీతారామమ్మగారికి మాటాడేందుకు అవకాశం యిస్తూ ఆగారు. ఆవిడ క్షణికోద్రేకం తెచ్చుకుని ''మనకో కుర్రవాడు అవసరం అని నాకు బాగా అనిపిస్తోంది. వాడికి మనం అవసరం అవటం మనం నడిచే విధానాన్ని బట్టి వుంటుంది. వాడిని నేను నేర్పుగా పెంచలేక పోతానని నాకేం అపనమ్మకంలేదు. వాడి భవిష్యత్తుని మనం చేజేతులా పాడుచేసే అగత్యం యేమీలేదు - అన్నీ మీకు అనుమానాలేగాని!'' అన్నది. స్థూలంగా విచారిస్తే సీతారామమ్మగారికి భర్త వెలిబుచ్చిన అంశాల్లో యే ఒక్కటీ ఆలోచన కాస్కారం కలది కనిపించలేదు. ఆమె కిష్టిగాడిని తెస్తేగాని నాకింక మనశ్శాంతి కరువైపోతుంది అన్న క్షణంలో సీతాపతిగారికి తను అభ్యంతరం చెప్పాల్సిన అవసరం కూడా కనిపించలేదు. ఈ ప్రపంచం, ప్రపంచంలోని జీవితం, జీవితంలోని దశలూ ఎంత తాత్కాలికమూ, క్షణభంగురమూ అయినా వాటికి మూలకారణాలైన మమకారాలు, అనుబంధాలు మటుకు ఎంతో విలువైనవని సీతాపతిగారు విశ్వసిస్తారు.

తలవని తలంపుగా అన్నగారి రాక వెంకటేశ్వర్లు కేమీ ఆశ్చర్యం కలిగించలేదు; యేమంటే యే నాడైనా ఆయన తన యింటికిట్లారాగలవాడేననీ, తనతో ''కిష్టిగాడిని నాతో తీసుకెడతాన్రా, యేమంటావ్?'' అంటాడనీ ముందే తెలుసు. పోతే యిందుకు కిష్టిగాడి తల్లి శాంతమ్మకయినా అభ్యంతరం వుండవలసిన పనిలేదు; ఆవిడసలే పిల్లలకోడి. కాగా కుర్రాడయినా వెడుతున్నది పెద్దనాన్న, పెద్దతల్లి యింటికేగాని మరో చోటుకి కాదు.

భోజనాలయాక, మధ్యాహ్నంపూట, వెంకటేశ్వర్లు కురాళ్ళతో చింతగింజలాట ఆడుకుటున్న కిష్టిగాడిని చెయ్యి పట్టుకు తీసుకొచ్చి పెద్దనాన్న ముందు నించోబెట్టి ''ఏంరా, పెద్దనాన్నతో వూరికి వెడతావా?'' అంటే---- వాడు ఘాటుగా తలవూపి ''ఓ'' అనేసి తటాలున సీతాపతిగారి ఒళ్ళో దూరాడు. ఆయన కిష్టిగాడి వీపు నిమురుతూ ''ఏంరా, యేం చదూతున్నావ్?'' అన్నాడు ముద్దుగా. ''రొండు...''

''వీడికి మొన్న జూలైలోనే యెనిమిదో యేడువచ్చింది. పంతులు బళ్లో రొండో క్లాసు చదూతున్నాడు, ఒక్క చదువే కాదు, అల్లరి కూడా బాగానేచేస్తాడు'' అన్నాడు వెంకటేశ్వర్లు. శాంతమ్మ తలుపు వెనకాలనించీ అందుకొంటూ ''అందరికన్నా పైచెయ్యి వీడిదే! అల్లరి చేసినా ఎంతో తెలివిగా చేస్తాడు, ఎందుకోగాని వీడికి అన్ని సంగతులూ కావాలి!'' అంది.

ఆ సాయంత్రమే పెద్దనాన్నతో సహా కిష్టిగాడు పెద్దమ్మ దగ్గరికి ప్రయాణం అయినాడు. వెంకటేశ్వర్లు రైలుదగ్గర కొచ్చి "వాడసలు బెంగ పెట్టుకోడనుకుంటాను. ఒకవేళ యేమన్నా అనుకున్నా మేమెవరమో వొచ్చి చూసివెడతాంలే" అన్నాడు. ఇంటిదగ్గరే శాంతమ్మ పిల్లవాడి చెవిలో వూదింది. సీతాపతిగారు గంభీర హృదయుడు; పైకేమీ అనలేదు. ఆయన మనుకిదంతా యేదో కట్టుకథలాగనిపిస్తూంది. గతించిందానికేమీ టింగటిల్లి లాభం లేదు. కిష్టిగాడి హుషారు ఆయనకీ అంటు వ్యాధిలా తగిలింది. రైల్లో కూచున్నంతసేపూ వాడి వుత్సాహం యింతంతా కాదు. కొత్త సంగతులనేకం అడుగుతున్నాడు. వాటికి మృదువుగా సమాధానం చెప్పటంలో సీతాపతిగారికి యెంతో ఆనందం కలుగుతోంది.

పెత్తండ్రీ, కొడుకూ యింటి గుమ్మం యెక్కే సరికి సీతారామమ్మగారు యెదురై "యిప్పుడే అనుకుంటున్నాను రైలు వొచ్చే వుంటుందని" అంది. కిష్టిగాడిని దగ్గరకు తీసుకుని ముద్దులాడే ముచ్చటలో ఆవిడకి భర్త కాళ్ళకి నీళ్ళన్నా యిద్దామని తోచిందికాదు; ఏమైనా ఆయనగారి బాధ్యత మటుకు తీరిపోయింది.

కిష్టడికి కొత్తనేది లేదు. వాడు పెద్దతల్లి దగ్గరికి బహు ఆప్యాయంగా వెళ్ళాడు. బాగా కబుర్లు చెప్పాడు. సీతారామమ్మగారికి వాడు తనని పెద్దమ్మా అని పలిచినప్పుడు మాత్రం కొంచెం "వెగటు"గా తోచేది. అంచేత ఆవిడ రెండోనాడు వాడితో "నన్ను అమ్మా అని పిలూ నాన్నా" అన్నది. వాడు కూడా యేమీ అభ్యంతరం చెప్పకుండానే ఒప్పుకున్నాడు కూడాను; పైగా "పెద్దనాన్నని నాన్న అని పిలవమంటావా? అమ్మా" అనడిగాడు. చిన్నవాడయినా తెలివైన ప్రశ్నవేసినందుకు సీతారామమ్మగారి మనస్సు వాడిని చూచి మహా మురిసిపోయింది. "ఆ మాట మీ పెదనాన్నే అడుగు !" అన్నది. సీతాపతిగారు మాత్రం "నీ యిష్టం వచ్చినట్టు పిలవరా" అనేశాడు. కిష్టాయి "అయితే పెదనాన్నా అనే పిలుస్తాను" అన్నాడు.

వాడట్లానే పిలుస్తానని ఎందుకు నిశ్చయించుకున్నాడో సీతారామమ్మగారికి అర్థం కాలేదు. ❋

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక)